సాక్షి గుంటూరు

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: 'ఒక కుటుంబం–ఒక వ్యాపారవేత్త' పోస్టర్‌ను కలెక్టర్ కృతికా శుక్లా గురువారం ఆవిష్కరించారు. ఎల్‌డీఎం రామ ప్రసాద్, మెప్మా పీడీ పాల్గొన్నారు.



సాగర్‌లో క్రస్ట్ గేట్లు మూత

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు తగ్గడంతో గురువారం క్రస్ట్ గేట్లు మూసివేశారు. ప్రస్తుతం నీటిమట్టం 589.30 అడుగులు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 53,355 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 53,355 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

మిర్చి యార్డును సందర్శించిన కలెక్టర్



కొరిటిపాడు(గుంటూరు వెస్ట్): జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా గురువారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి గుంటూరు మిర్చి యార్డులో పర్యటించారు. క్రయ విక్రయాలు, ఎగుమతి వ్యాపారుల వరకు జరిగే ప్రక్రియను పరిశీలించారు. యార్డులో కార్యకలాపాలను మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, యార్డు ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, పలువురు వ్యాపారులు వివరించారు. 415 మంది వ్యాపారులు ఉన్నారని, సీజన్‌లో రోజుకు రెండు లక్షల బస్తాల వరకు సరుకు వస్తుందని, మిగిలిన రోజుల్లో ఏభై వేల వరకు వస్తాయని వివరించారు. చైనా, థాయిలాండ్, కొలంబో, ఇండోనేషియా, మలేసియా తదితర దేశాలకు ఎక్కువగా మిర్చి ఎగుమతులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ.చంద్రిక, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : జిల్లాలో రాత్రుళ్లు అనవసరంగా సంచరించే వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈనెల 12న నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 106 మందిపై 104 కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి మళ్లీ జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో డ్రైవ్ చేపట్టారు. 181 మందిపై 173 కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ చేశారు. అనవసరంగా రాత్రుళ్లు బయటకు రావద్దని సూచించారు. చట్టాలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

శ్రీనివాస కల్యాణంలో కేరళ రాష్ట్ర డీజీపీ ఆజాద్



ఫిరంగిపురం: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో గురువారం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. కేరళ రాష్ట్ర డీజీపీ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్యాణ వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు పూజలు నిర్వహించారు. అనంతరం మూల మూర్తులకు తలంబ్రాలు పోశారు. పూజా విధి విధానాల గురించి గౌరీశంకర్ వివరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను దేవదాయశాఖ ఈఓ బి.సురేష్ పర్యవేక్షించారు. కల్యాణ వేడుకలకు కేరళ రాష్ట్ర డీజీపీ చంద్రశేఖర్ ఆజాద్ రావడంతో సీఐ శివరామకృష్ణ, ఎస్‌ఐ సురేష్‌ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 5,527 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవల్‌కి 276 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,122 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 201, పశ్చిమ కాలువకు 211, నిజాంపట్నం కాలువకు 420, కొమ్మూరు కాలువకు 2,600 క్యూసెక్కులు బ్యారేజ్ నుంచి విడుదల చేశారు. సముద్రంలోకి 36,250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

బాజీ బాబాకే టోకరా

- పెదకాకాని బాజీ బాబా దర్గాలో దోపిడీల పర్వం
- యథేచ్ఛగా కూటమి నాయకుల దందా
- అధికారులతో కుమ్మక్కు
- కానుకల లెక్కింపులో చేతివాటం
- అక్రమాలను అరికట్టాలని ముస్లిం హక్కుల పోరాట సమితి డిమాండ్



పెదకాకానిలోని బాజీ బాబా దర్గా ముఖ ద్వారం

పెదకాకాని: బాజీ బాబా దర్గాలో కూటమి నాయకుల దందాలు, ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వక్ఫ్‌బోర్డు అధికారులతో కుమ్మక్కై బాబా వారికి భక్తులు సమర్పించిన కానుకలు పెద్ద మొత్తంలో కాజేస్తున్నారు. వక్ఫ్ బోర్డు మేనేజ్‌మెంట్‌లో కొనసాగుతున్న హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పేరు ఉంది. భక్తులు వచ్చి ప్రార్థనలను చేసుకోవడం, మొక్కులు చెల్లించుకోవడం దశాబ్దాలుగా ఇక్కడ జరుగుతోంది. పలువురు భక్తులు బాబా వారిపై ఉన్న భక్తితో శక్తికొలది దర్గా అభివృద్ధికి కానుకలు నగదు రూపంలో చెల్లిస్తుంటారు. మరికొందరు దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం షెడ్లు నిర్మించారు.

టెంట్ హౌస్ వ్యాపారం

గతంలో దర్గాకు వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా వంట అక్కడే చేసుకునేవారు. వర్షా కాలం భోజనం తినే సమయానికి వాన వచ్చి అనేక ఇబ్బందులు పడిన సందర్భాలు కొల్లలు. దీంతో దాతలు దర్గాలో మొక్కులు చెల్లించుకునే వారి సౌకర్యార్థం షెడ్డును నిర్మించారు. దీన్ని కూటమి నాయకులు ఆక్రమించుకుని అందులో టెంట్‌హౌస్ వ్యాపారం నిర్వహిస్తున్నారు.

దాత కోరినా పట్టించుకోని అధికారులు

బాబాపై ఉన్న భక్తితో షెడ్డు నిర్మించానని, అందులో టెంటు సామాను ఖాళీ చేయించి భక్తులకు ఉపయోగపడేలా చూడాలని దాత కోరినప్పటికీ వక్ఫ్‌బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. భక్తులు దర్గాకు వస్తూ టెంటు, సామాన్లు తెచ్చుకున్నా అడ్డుకుంటున్నారు. తమ దగ్గరే తీసుకోవాలంటూ హుకుం జారీ చేస్తున్నారు.

హుండీల్లోని నగదు హుష్ ?

దర్గాలో మూడు నెలలకు ఒకసారి హుండీలు తెరచి కానుకలు లెక్కింపు చేస్తూ ఉంటారు. ఈ సమయంలో చిల్లర నాణేలు సుమారు రూ. 2 లక్షల వరకూ వస్తుంటాయి. స్థానిక కూటమి నాయకుడి ఒత్తిడితో లెక్కించకుండానే రూ. 30 వేల నుంచి రూ. 40 వేలు తీసుకుని అతనికి అప్పగిస్తున్నారు. హుండీల్లోని కానుకలు లెక్కింపు సమయంలో కూడా కూటమి వారికి అనుకూలమైన ఫోటో వీడియోగ్రాఫర్‌ను ఏర్పాటు చేసుకుని హుండీల్లోని నగదు కాజేస్తున్నారని భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వక్ఫ్‌బోర్డు అధికారులు, స్థానిక ఈఓ, కూటమి నాయకులు కుమ్మక్కై ఫోటోలకు, వీడియోకు దొరక్కుండా నగదు కాజేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వక్ఫ్ బోర్డులో పనిచేస్తున్న కొందరు అవినీతి అధికారులు కూడా అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, వక్ఫ్‌బోర్డు అధికారులు, చైర్మన్ స్పందించి అక్రమాలను అరికట్టాలని భక్తులు, పెదకాకాని ప్రజలు కోరుతున్నారు.



దర్గాలో షెడ్డును ఆక్రమించుకుని టెంట్ హౌస్ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

అక్రమాలను అరికట్టాలి



వక్ఫ్ బోర్డు అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి అక్రమాలను అరికట్టాలి. టెంట్ హౌస్‌ను వెంటనే తొలగించాలి. హుండీల కానుకలు లెక్కింపులో సమయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. వారికి అనుకూలమైన ఫోటోగ్రాఫర్‌ను పెట్టుకుని కూటమి నాయకులు, వక్ఫ్‌బోర్డు అధికారులు కుమ్మక్కై బాబా వారికి భక్తులు సమర్పించిన కానుకలు పెద్ద మొత్తంలో కాజేస్తున్నారు.

– షేక్ ఖాజావలి, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

సూపర్ జీఎస్టీపై 19 వరకు ఎగ్జిబిషన్ కమ్ సేల్



ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ గుంటూరు జిల్లా ఉత్సవ్‌ను కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ నెల 19వ తేదీ వరకు ఉత్సవ్ జరుగుతుందని ఆమె తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ధరలు తగ్గలేదని ఫిర్యాదులు రాకూడదని వ్యాపారులకు సూచించారు. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎస్టీ 2.0పై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని, తద్వారా ప్రశ్నించే అవకాశం ఉంటుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జీఎస్టీలో వచ్చిన పొదుపును గృహ అవసరాలకు ఖర్చు చేయాలని సూచించారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి. గీతా మాధురి మాట్లాడుతూ ప్రతి వస్తువుపై జీఎస్టీ ధరల తగ్గుదలను ప్రతి ఒక్కరూ గమనించాలని తెలిపారు.

ఏసీ కళాశాల ఆవరణలో ఏర్పాట్లు

జీఎస్టీ 2.0పై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఏసీ కళాశాల ఆడిటోరియం హాలులో ఉత్సవ్‌ను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా లోగో కూడా తయారు చేయించారు. ప్రతి రోజూ రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్‌లో అమ్మకాలు జరుగుతాయి. పచ్చళ్లు, పొడులు, గృహోపకరణాలు, క్రీడా పరికరాలు, జిమ్, ఫిట్‌నెస్, సోలార్, బుక్స్ స్టేషనరీ, వ్యవసాయ పరికరాలు, పురుగు మందులు, అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులు, వాహనాలు, ట్రాక్టర్లతో 70 స్టాల్స్ ఏర్పాటు చేశారు.

రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, పాడి పరిశ్రమ రంగాల్లో పెట్టుబడి వ్యయం తగ్గించి దిగుబడులు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు అవలంబించాల్సిన పద్ధతులపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ఆమె పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు వివరాలు, దిగుబడి, సాగు ప్రోత్సాహానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రాయితీల వివరాలు, పంటల వారీగా సాగు పెట్టుబడి, దిగుబడి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆమె వివరించారు.

కొండవీడుకోటలో 'సంక్రాంతి' ఫెస్టివల్

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



జిల్లా అధికారులతో కలిసి కొండవీడుకోటను సందర్శించిన కలెక్టర్ కృతికా శుక్లా

యడ్లపాడు: సంక్రాంతి పర్వదినం నాడు జిల్లాలోని పర్యాటక కేంద్రాలైన కోటప్పకొండ, కొండవీడు ప్రాంతాల్లో టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఫెస్టివల్ నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు. ఇప్పటికే అటవీశాఖ, టూరిజం శాఖల అధికారులు దీనిపై రూపకల్పన చేశారన్నారు. కొండవీడుకోటను కలెక్టర్ కృతికా శుక్లా పలుశాఖల జిల్లా స్థాయి అధికారులతో కలసి గురువారం సందర్శించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా పరిధిలోని అన్ని పర్యాటక కేంద్రాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఘాట్ రోడ్డు ప్రారంభంలోని చెక్‌పోస్టు వద్దకు రాగానే కలెక్టర్‌కు డీఎఫ్‌వో జి కృష్ణప్రియ స్వాగతం పలికారు. రిజర్వ్ ఫారెస్టు భూముల వివరాలను కలెక్టర్‌కు వివరించారు.

మొదలైన పంట కోత ప్రయోగాలు

- ప్రణాళిక, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సేకరణ
- ఐదు పంటల్లో 140 ప్రయోగాలు

కొరిటిపాడు(గుంటూరు): ఖరీఫ్‌లో దిగుబడులు అంచనా వేయడానికి ప్రణాళిక, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో పంట కోత ప్రయోగాలు మొదలయ్యాయి. గతంలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ–క్రాప్ ఆధారంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేసింది. పెద్ద ఎత్తున పరిహారం కూడా ఇవ్వడంతో పంట కోత ప్రయోగాలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. కొన్ని పంటలకు వాతావరణ బీమా, మరికొన్ని పంటలకు దిగుబడుల ఆధారంగా ఫసల్ బీమా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో కొన్ని పంటలకు గ్రామం యూనిట్‌గా, ఇంకొన్ని పంటలు జిల్లా యూనిట్‌గా తీసుకున్న నేపథ్యంలో పంట కోతలకు ప్రాముఖ్యత నెలకొంది. ఈ క్రమంలో ఎంపిక చేసిన గ్రామాలు, సర్వే నంబర్ల ఆధారంగా పొలాల్లో నిర్ణీత కొలతల్లో పంట తొలగించి వాటి దిగుబడులను పారదర్శకంగా అధికారులు లెక్కిస్తున్నారు. ఇందులో 60 ప్రయోగాలు ప్రణాళిక శాఖకు చెందిన ఏఎస్‌ఓలు చేస్తారు. మిగిలిన 80 ప్రయోగాలు వ్యవసాయ శాఖకు చెందిన ఏఈఓలు నిర్వహించి దిగుబడులు అంచనా వేయనున్నారు. ప్రయోగాలన్నింటినీ క్రోడీకరించి ప్రణాళిక శాఖ ప్రభుత్వానికీ, ఉన్నతాధికారులకు పంపనుంది.ఐదు పంటల్లో 140 ప్రయోగాలు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అయితా నాగేశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు. వరిలో అత్యధికంగా 54, పత్తిలో 36, మినుములో 13, మిరపలో 27, సోయాబీన్‌లో మూడు పంట కోత ప్రయోగాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పంట కోతలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్. వెనుక ముసుగులో నిందితులు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : పరువు హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, ఎస్‌హెచ్‌ఓ కె.వెంకట ప్రసాద్, ఎస్‌ఐ ఎన్.సి.ప్రసాద్‌లు గురువారం వివరాలను వెల్లడించారు. పొన్నూరు రోడ్డులో ఈనెల 7న కుర్రా నాగ గణేష్ (25)ను హత్య చేశారు. బుడంపాడులో నివాసం ఉండే నాగ గణేష్ కొలకలూరు గ్రామానికి చెందిన కీర్తి వీరాంజనేయదేవిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వివాహం ఇష్టం లేని ఆమె సోదరుడు కీర్తి దుర్గారావు ఈనెల 7న స్నేహితులతో కలిసి నాగ గణేష్‌ను హత్య చేశాడు. ఈ క్రమంలో మృతుడు తండ్రి శివాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం తెనాలి కొలకలూరు గ్రామానికి చెందిన షేక్ నూర్‌బాషా అలియాస్ జలాలి, బత్తిన లోకేష్, నందివెలుగు గ్రామానికి చెందిన తుమ్మల శివయ్య, జంపని వంశీ, గుంటూరు రూరల్ మండలం నివాసగొర్లవారిపాలేనికి చెందిన శాఖమూరి గోపీకృష్ణ, కీర్తిపాములు, కుంచనపల్లికి చెందిన దాసరి వీరయ్య అలియాస్ చుక్కపల్లి వీరయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

పోలీసులను ఆశ్రయించిన హతుడు

సెప్టెంబరు 25న వివాహం జరిగిన తరువాత వీరాంజనేయదేవి కుటుంబ సభ్యుల నుంచి ప్రాణ హాని ఉందని కుర్రా నాగ గణేష్ ఆమెతో కలిసి నల్లపాడు పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే పలుమార్లు గణేష్‌ను చంపుతామంటూ ప్రధాన నిందితుడు దుర్గారావు బెదిరింపులకు పాల్పడిన పరిస్థితులున్నాయి. నాగ గణేష్, స్నేహితుడు సంగుల కరుణతో కలిసి ఈనెల 7న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయానికి వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఈ క్రమంలో పొన్నూరు రోడ్డులోని ఎం. కన్వెన్షన్ పంక్షన్ హాలు సమీపంలో దుర్గారావు ఇద్దరు వ్యక్తులతో వచ్చి మృతుడిని విచక్షణారహితంగా పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. పక్కనే ఉన్న స్నేహితుడు గణేష్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లే సరికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈనెల 15న రాత్రి తొమ్మిది గంటల సమయంలో గుంటూరు రూరల్ మండలం అడవితక్కెళ్లపాడు పంచాయతీ గొర్లవారిపాలెం వెళ్లే రోడ్డులో నిందితులు ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఇదే కేసులో ఏ–8గా పేర్కొన్న దాసరి వీరయ్య హత్యకు కుట్ర చేసి ప్రోత్సహించిన నేపథ్యంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి హత్యకు వినియోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

దాసరి వీరయ్యకు రిమాండ్

గుంటూరు లీగల్: హత్య కేసులో దాసరి వీరయ్య అలియాస్ చుక్కపల్లి వీరయ్యను రిమాండ్‌కు పంపుతూ ఆరవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుడంపాడు గ్రామానికి చెందిన కుర్రా నాగ గణేష్ హత్య కేసులో వీరయ్య ప్రమేయం ఉందంటూ నేరారోపణ ఉన్న క్రమంలో 8వ ముద్దాయిగా గుర్తిస్తూ పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టులో వాద ప్రతివాదనల అనంతరం వీరయ్యకు 14 రోజుల వరకు రిమాండ్ విధించారు. ఆయన్ను పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

పాత కోటేశ్వరుడి చెంతకు చేరేదెలా!

- ఆలయానికి మెట్ల దారి నిర్మాణానికి గత ప్రభుత్వంలో ప్రణాళికలు
- రెండు వేల మెట్లు నిర్మించాలని అంచనా
- 'మెట్టుకో దాత' పేరిట విరాళాలు సేకరించాలని నిర్ణయం
- ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న దాతలు
- మూడేళ్లవుతున్నా మంజూరు కాని అటవీ శాఖ అనుమతులు
- కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలంటున్న భక్తులు
- మెట్ల మార్గంతో కోటప్పకొండకు ఆధ్యాత్మిక, పర్యాటక శోభ



పాత కోటయ్య ఆలయానికి నడక మార్గం



పాత కోటయ్య స్వామి

సాక్షి,నరసరావుపేట/ నరసరావుపేట రూరల్: దక్షిణామూర్తిగా దర్శనమిచ్చే పాత కోటేశ్వరస్వామిని మెట్ల మార్గం ద్వారా వెళ్లి దర్శించుకోవాలని భక్తుల కోరిక. ఆ చిరకాల కోరికను నెరవేర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ప్రణాళికలు సిద్ధం చేసి సాధ్యాసాధ్యాలను ప్రజాప్రతినిధులు, అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలన చేశారు. అప్పటి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, డీఎఫ్‌ఓ రామ చంద్రరావు, ఆలయ ఈఓ వేమూరి గోపిలు మెట్ల మార్గం పనులు ప్రతిపాదనలను సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషించారు. దాతలు, దేవస్థానం నిధులతో ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మెట్ల మార్గం నిర్మాణానికి ఎంతో కీలకమైన అటవీశాఖ అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. దాదాపు మూడేళ్లు అవుతున్నా ఇప్పటికీ అనుమతులు సాధించడంలో ముందడుగు పడటం లేదు. కూటమి ప్రభుత్వం త్వరగా అనుమతులు తీసుకువచ్చి పనులు మొదలుపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

ముళ్ల పొదలు దాటుకుంటూ...

కోటప్పకొండపై ఉన్న ప్రధాన ఆలయం వరకే ఇప్పటి వరకు మెట్ల మార్గం ఉంది. దక్షిణామూర్తి రూపంలో కొండ శిఖరాన నెలవైన పాత కోటేశ్వరుడి ఆలయానికి వెళ్లడానికి ప్రస్తుతం మార్గం లేదు. శివరాత్రి తిరునాళ్ల సమయంలో, ఇతర ముఖ్యమైన రోజుల్లో రాళ్లు, ముళ్లపొదల వెంబడి భక్తులు కొండను ఎక్కి గుడిని చేరుకుంటారు. భక్తులే ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. దేవదాయ శాఖ తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించింది.

ఆధ్యాత్మికం, పర్యాటకంగా అభివృద్ధి

ప్రధాన ఆలయం నుంచి పాత కోటేశ్వరస్వామి ఆలయం వరకు దాదాపు 2,000 మెట్లు పడతాయని అధికారులు అంచనా వేశారు. పది అడుగుల వెడల్పుతో నిర్మించే మార్గంలో ఐదు అడుగులు కొండపైకి వెళ్లడానికి, ఐదు అడుగులు కొండ దిగటానికి వేరు చేసేలా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రతి 50 మెట్లకు ఓ చోట భక్తులు, పర్యాటకులు సేద తీరడానికి బల్లలు ఏర్పాటు చేసి, అక్కడక్కడా నీడ కోసం రేకులతో షెడ్ నిర్మాణం, తాగునీరు అందుబాటులో ఉంచాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. మెట్ల మార్గం పూర్తయితే పాత కోటేశ్వరుడి ఆలయం అభివృద్ధి పనులకు మోక్షం కలగనుంది. కోటప్పకొండకు ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత శోభ చేకూరనుంది.

అటవీ శాఖ అనుమతులతో ఆలస్యం

మెట్ల మార్గం నిర్మాణాన్ని అటవీ శాఖ భూముల నుంచి చేపట్టాల్సి ఉంది. దీని కోసం సంబంధిత శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో ఫైల్‌ను కేంద్ర అటవీ శాఖకు పంపారు. ఇప్పటి వరకు క్లియర్ చేయించడంలో కూటమి నాయకులు ఆసక్తి చూపడం లేదు. సనాతన ధర్మం కోసం పాటుపడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర అటవీ శాఖ మంత్రిగాను, కేంద్రంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కీలక పదవుల్లో ఉన్నారు. అయినప్పటికీ అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'మెట్టుకో దాత' పేరిట విరాళాలు

పాత కోటయ్య స్వామి దర్శనాన్ని భక్తులకు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భావించారు. త్రికోటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి పాత కోటయ్య స్వామి ఆలయానికి మెట్ల మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిపై అధికారులు సర్వే పూర్తిచేశారు. ప్రతిపాదిత మెట్ల మార్గం నిర్మాణానికి దేవస్థానం వద్ద నిధుల కొరత, మరోవైపు భక్తులు తాము కూడా ఆ గొప్ప కార్యక్రమంలో పాలుపంచుకున్నామన్న భావన కలగడానికి విరాళాలు సేకరించేలా గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 'మెట్టుకో దాత' పేరిట ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు. ఇందులో భాగంగా ప్రతి మెట్టు(స్టెప్)కు దాతల నుంచి రూ.20 వేలు స్వీకరించనున్నారు. ఆ మెట్టుపై నగదు అందజేసిన దాత పేరు కనిపించేలా చెక్కుతారు. ఈ కార్యక్రమానికి అప్పట్లో భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. మెట్ల మార్గం నిర్మాణానికి విరాళాలు ఇవ్వడానికి కొందరు ప్రజాప్రతినిధులు, భక్తులు ముందుకు వచ్చారు. ప్రతిపాదనలు సిద్ధమైన తొలి రోజే దాదాపు రూ.కోటి విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చినట్టు ఆలయ అధికారులు అప్పట్లో వెల్లడించారు. అయితే అటవీ, దేవాదాయ శాఖ నుంచి అనుమతులు వచ్చిన తర్వాత విరాళాల సేరణకు సిద్ధమయ్యారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యం



గత ప్రభుత్వంలో మెట్ల మార్గానికి అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేశాం. దాతలు కూడా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంది. ప్రభుత్వాలు ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఇప్పటి వరకు అటవీ అనుమతులు కూడా తీసుకు రాలేక పోయారు.

–డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నరసరావుపేట

అనుమతులు కోసం ప్రయత్నిస్తున్నాం...



మెట్ల మార్గం నిర్మాణం మొదలు పెట్టాలంటే ఆటవీ శాఖ భూమిని దేవస్థానానికి అప్పగించాల్సి ఉంటుంది. అటవీ శాఖ అనుమతులు ఇచ్చేందుకు సుముఖత తెలిపింది. ఆ ప్రక్రియ పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కొద్ది నెలల్లోనే అనుమతుల ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నాం. అనుమతులు లభిస్తే మెట్ల మార్గం పనులు ప్రారంభిస్తాం.

–డి.చంద్రశేఖర్, ఈవో, కోటప్పకొండ దేవస్థానం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,400** గరిష్ఠం : రూ. **2,200**

మోడల్ ధర రూ. **1,800**

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	53,310
అమ్మకాలు	56,640
నిల్వ	11,920

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–15,000
నంబరు–5	10,000–14,500
273	10,500–13,700
341	10,000–15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–15,000
నంబరు–5	10,000–14,580
341	10,000–15,600
సూపర్–10	10,000–14,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,200
బాడిగ–355	10,500 – 15,800
దేవనూరు డీలక్స్	10,000 – 14,700
ఆర్మూర్	10,000 – 12,500
తాలుకాయలు	5,500 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,000
బాడిగ – 355	10,000–15,300
దేవనూరు డీలక్స్	10,500–14,800
తాలు	5,300 – 8,000

–కొరిటిపాడు (గుంటూరు)

రైలు ఎక్కితే రక్షణ కరువు

- ప్రయాణికుల గుండెల్లో రైళ్లు
- పెరుగుతున్న దోపిడీలు, దొంగతనాలు
- తాజాగా ప్రయాణికురాలిపై అత్యాచారం
- సికింద్రాబాద్‌లో కేసు నమోదు చేసి నడికుడికి బదిలీ
- జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ల్లో సిబ్బంది కొరత



నడికుడి రైల్వేస్టేషన్

దాచేపల్లి : రైలు ప్రయాణికులకు భద్రత కరువైంది. ఇటీవల జరిగిన వరుస ఘటనలతో గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఇటీవల ప్రయాణికుల నుంచి దుండగులు బంగారం, నగదు దోచుకున్న ఘటనలు భారీగా జరిగాయి. తాజాగా సంత్రగాచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడటం తీవ్ర సంచలనంగా మారింది. రైలు ప్రయాణికుల్ని కలవరపాటుకు గురి చేసింది.

కత్తితో బెదిరించి అత్యాచారం

ఏపీకి చెందిన ఓ మహిళా ప్రయాణికురాలు(35) సోమవారం రాజమహేంద్రవరం స్టేషన్‌లో చర్లపల్లి వెళ్లేందుకు సంత్రగాచి ప్రత్యేక రైలు ఎక్కింది. ఆమె అక్కడ ఇళ్లల్లో పని చేసుకుని జీవించేందుకు వెళుతోంది. రైలు గుంటూరు స్టేషన్‌కి చేరుకున్న తరువాత మహిళా బోగీలో ఉన్న ప్రయాణికులంతా దిగి పోయారు. ఆమె ఒక్కతే మిగిలింది. బోగీలోని 40 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి ఎక్కేందుకు ప్రయత్నించగా ఆమె ఒప్పుకోలేదు. బలవంతంగా ఎక్కాడు. గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన 20 నిమిషాల తరువాత బోగీ తలుపులు మూసివేశారు. ఒంటరిగా ఉన్న మహిళ ప్రయాణికురాలిని కత్తితో బెదిరించి, బలవంతంగా ఆత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె వద్ద ఉన్న రూ. 5,600తో పాటు సెల్‌ఫోన్, హ్యాండ్ బ్యాగ్ లాక్కొని దాడి చేసి, పెదకూరపాడు చేరుతుండగా కిందకు దిగి పారిపోయాడు. రైలు మంగళవారం చర్లపల్లి స్టేషన్‌కు చేరుకున్న తరువాత బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తర్వాత నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు.

బెంబేలెత్తుతున్న ప్రయాణికులు

ఇటీవల నడికుడి, తుమ్మలచెరువు, పిడుగురాళ్ల, బెల్లంకొండ స్టేషన్ల పరిధిలో రైళ్లల్లో ప్రయాణికులను బెదిరించి బంగారం, నగదును దుండగులు దోచుకున్నారు. ఆగంతకులు రైళ్లను ఆపి పారిపోవడం ఆ శాఖకు సవాల్‌గా మారింది.



నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలో చోరీ జరిగిన ప్రదేశం

జీఆర్పీ, ఆర్పీఎఫ్‌లో సిబ్బంది కొరత

రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటైన జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ల్లో సిబ్బంది కొరతతో ప్రయాణికులకు సరిపైన భద్రత కల్పించటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరు రైల్వే డివిజన్‌లో రెండో అతి పెద్ద స్టేషన్ అయిన నడికుడి రైల్వే జంక్షన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని పిడుగురాళ్లకు తరలించారు. నడికుడి స్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో ఎస్‌ఐగా నరసరావుపేట స్టేషన్‌లో పని చేస్తున్న అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. స్టేషన్లలో, రైళ్లలో సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల దుండగులు యథేచ్ఛగా దోపిడీలకు పాల్పడుతున్నారు.

పత్తిలో పూత రాలడాన్ని నివారించాలి

కేంద్రీయ సస్య రక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె. వీరయ్య చౌదరి

ప్రత్తిపాడు: పత్తిలో పూత రాలడాన్ని నివారించే దిశగా రైతులు చర్యలు తీసుకోవాలని కేంద్రీయ సస్య రక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె. వీరయ్య చౌదరి సూచించారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో గురువారం ఓ పత్తి పొలంలో పొలంబడి నిర్వహించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణా బేగంతో కలిసి వీరయ్య చౌదరి పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధిక తేమ కారణంగా పత్తిలో పూత రాలడంతో పాటు పలు తెగుళ్లు, పురుగులను గమనించారు. నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. పూత రాలడాన్ని నివారించేందుకు ఎకరానికి కేజీ 19–19–19 లేదా 13–0–45 పిచికారీ చేయాలని సూచించారు. పంటలో అక్కడక్కడా పచ్చ దోమ కూడా ఉందని, నివారణకు ఫిప్రోనిల్ 2 ఎం.ఎల్. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 ఎం.ఎల్. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అల్లిక రెక్కల పురుగు వంటి మిత్ర పురుగులను కూడా అధికంగా గమనించామని, ప్రస్తుత పరిస్థితుల్లో పురుగు మందులను ఎక్కువగా వాడనవసరం లేదని సూచించారు. అధిక వర్షాలకు సోకుతున్న ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు పది లీటర్ల నీటికి కలిపి రెండు లేదా మూడుసార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ షణ్ముఖ్, రైతులు పాల్గొన్నారు.



పెదగొట్టిపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న వీరయ్య చౌదరి, ఏవో తదితరులు

డిసెంబర్ 12 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): క్రెడాయ్ గుంటూరు చాప్టర్ 8వ ప్రాపర్టీ షో బ్రోచర్ ఆవిష్కరణ గురువారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఓ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రెరా చైర్మన్ ఆరే శివారెడ్డి, ఏపీ రెరా మెంబర్ దామచర్ల శ్రీనివాసరావు, ది గుంటూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసరావు, క్రెడాయ్ ఏపీ మాజీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్ వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి ప్రాపర్టీ షోను డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఇందులో నాణ్యమైన అపార్ట్‌మెంట్లు, స్థలాల వివరాలతో పాటు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించిన స్టాల్స్ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ, ప్రాపర్టీ షో కన్వీనర్ టి.వినోద్‌రెడ్డి, గుంటూరు చాప్టర్ చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, ప్రెసిడెంట్ మామిడి రాము, సెక్రటరీ మెట్టు సాంబశివారెడ్డి, ట్రెజరర్ ఏ.వి. నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కార్యవర్గం

‘కపాస్ కిసాన్’యాప్‌తో పలు ఉపయోగాలు

సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా

కొరిటిపాడు(గుంటూరు): ‘కపాస్ కిసాన్’ యాప్‌తో పత్తి రైతులకు పలు ఉపయోగాలున్నాయని, వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 2025–26 పంట కాలంలో సీసీఐ మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో పత్తి విక్రయాలకు ‘కపాస్ కిసాన్’ మొబైల్ యాప్‌లో నమోదుకావాలని ఆయన తెలిపారు. యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ ఐఓఎస్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, మొబైల్ ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలని ఆయన సూచించారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి రైతుల ప్రయోజనాల కోసం, కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) పథకం కింద ప్రయోజనాలను పొందడానికి తప్పనిసరిగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

ఎంబీఏ ఐబీ కోర్సు ఫలితాలు విడుదల

ఏఎన్‌యు(పెదకాకాని): ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఐబీ) కోర్సు రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను నాగార్జున విశ్వవిద్యాలయం సీఈ ఆలపాటి శివప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. 60మంది పరీక్షలు రాయగా 57మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీఏ థియేటర్ ఆర్ట్స్ కోర్సు 2వ సెమిస్టర్‌లో 11మందికి గానూ ఐదుగురు ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 27వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సీఈ సూచించారు. అనంతరం వర్సిటీ పరిధిలో బీటెక్ కోర్సు 1/4 మొదటి సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. 350 మందికి గానూ 123 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 27లోగా ఒక్కో పేపర్‌కు రూ. 2,070 చెల్లించాలని సూచించారు.

మత్స్యకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ

చొరవ చూపించిన మంత్రి నారా లోకేష్

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: కృష్ణా నదిలో వరదల కారణంగా వల విసరక మత్స్యకారులకు భుక్తి కరువైంది. దయనీయంగా జీవిస్తున్నారని సాక్షిలో అక్టోబర్ 1వ తేదీన కథనం వెలువడింది. దీనికి స్పందించిన మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఆర్థిక సాయంతో గురువారం మత్స్యకారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి గంగపుత్రులు వేట లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మంత్రి లోకేష్ సహాయంతో 300 మందికి రెండు వేల రూపాయల చొప్పున నిత్యావసర వస్తువులను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న టీడీపీ నేతలు

షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 4న షార్ట్ హ్యాండ్, జనవరి 25,26వ తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైనట్లు ఆల్ ప్రిన్సిపాల్స్ టెక్నికల్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీవీఎస్ ప్రకాష్‌బాబు గురువారం తెలిపారు. ఆయా పరీక్షలకు హాజరుకాబోయే అభ్యర్థులు సమీపంలోని టైప్ ఇనిస్టిట్యూట్స్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

గంజాయి స్వాధీనం

పెదకాకాని: నగర శివారులోని బసవతారక రామనగర్ సమీపంలో ఇద్దరు గంజాయి తాగుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 250 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఎర్ల వెంకటచిన్న, గుంజి మోహన్‌లుగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో వారికి విక్రమ్ అనే వ్యక్తి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

కోనేరులోకి దూకి మహిళ ఆత్మహత్య

మంగళగిరి టౌన్: స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చెందిన పెద కోనేరులోకి దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళగిరి నగరంలో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు... మంగళగిరి నగర పరిధిలోని గండాలయ్యపేటకు చెందిన చలంచలం కామాక్షి (29) తల్లి ధనలక్ష్మితో కలసి జీవిస్తోంది. కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో భర్తతో పాటు పిల్లలు కూడా చనిపోయారు. పలు ఆలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ తల్లీకూతుళ్లు జీవనం సాగిస్తున్నారు. కామాక్షి కొంతకాలంగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతోందని, మానసిక ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేదని తల్లి ధనలక్ష్మి పేర్కొంది. గురువారం మధ్యాహ్నం కోనేరు వద్దకు వెళ్లి ప్రహరీ ఎక్కి కోనేటిలోకి దూకేసింది. సమీపంలో కొందరు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మంగళగిరి పట్టణ పోలీసులు సమీపంలోని సీసీ కెమెరా పుటేజ్‌ను పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి కామాక్షి మృతదేహాన్ని వెలికి తీశారు. సంఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా కోనేరు చుట్టూ ఫెన్సింగ్ ఉంటే ఇలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయని స్థానికులు తెలిపారు. కోనేరుకు మూడు పక్కలా ఫెన్సింగ్ ఉందని, దక్షిణం వైపు మాత్రం లేకపోవడం వల్లే ఈ ఘటనకు కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దక్షిణం వైపు కూడా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



కామాక్షి మృతదేహం

రైలులో 4.4 కిలోలు..



తెనాలి రూరల్: రైలులో తరలిస్తున్న గంజాయిని తెనాలి జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాటా నగర్ నుంచి ఎర్నాకులం వెళ్లే రైలులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రిబాబు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. రైలు గురువారం తెనాలి చేరుకోగానే బోగీల్లో తనిఖీలు చేపట్టారు. ఎస్–3 బోగీలోని ఓ బ్యాగులో 4.4 కిలోల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. వెంటనే తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు సమాచారమందించి, ఆయన సమక్షంలో సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తి పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వే పోలీసుల అదుపులో మృగాడు

తెనాలి రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసిన జీఆర్పీ పోలీసులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్)/, సత్తెనపల్లి: మూడు రోజు కిందట సంత్రగచి ఎక్స్‌ప్రెస్ రైలులో రాజమండ్రికి చెందిన ప్రయాణికురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని తెనాలి రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీసులు గురువారం అదుపులో తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివరాలు.. సంత్రగచి ఎక్స్‌ప్రెస్ రైలులో రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఓ మహిళ మంగళవారం చర్లపల్లి వరకు ప్రయాణించేందుకు మహిళా బోగిలో కూర్చుంది. గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే బోగిలో ఉన్న మహిళలంతా దిగి పోయారు. బోగిలో బాధితురాలు మాత్రమే ప్రయాణం చేస్తోంది. ఈ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి బోగిలోకి ఎక్కి, ఆమెను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. సెల్‌ఫోన్, రూ.5600 లాక్కొని పెదకూరపాడు రైల్వే స్టేషన్ సమీపంలో దిగి పరారయ్యాడు. దీంతో బాధితురాలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు ఫిర్యాదును నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో ఇక్కడి రైల్వే పోలీసులు తక్షణమే అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరాల ద్వారా అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి కోసం గాలింపులు ప్రారంభించారు. అయితే, దర్యాప్తులో అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి పల్నాడు జిల్లా, సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తెనాలి రైల్వే స్టేషన్‌లో అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని జీఆర్పీ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. అతడిపై పాత నేరాలు ఏమైనా ఉన్నాయా ? అనే కోణంలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

19న ‘మట్టి రంగు’ పుస్తకావిష్కరణ

బాపట్ల: ప్రముఖ కవయిత్రి చిల్లర భవానీదేవి రచించిన ‘మట్టి రంగు’ కవితా సంపుటి ఆవిష్కరణ ఈ నెల 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక హోటల్ గౌతం వేదిక హాలులో జరగనుంది. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ తెలిపారు. రచయిత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. రచయిత్రి వెలువోలు నాగరాజ్యలక్ష్మి సభాధ్యక్షత , సాహితీ విమర్శకులు బీరం సుందరరావు పుస్తక పరిచయాన్ని చేస్తారని తెలిపారు. ఆత్మీయ అతిథిగా ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డా. పి.సి. సాయిబాబు పాల్గొననున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల స్మారక సాహితీ పురస్కారాన్ని డా. అప్పాజోస్యుల సత్యనారాయణకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

19న జిల్లా హేతువాద సంఘ మహాసభలు

బాపట్ల: జిల్లా హేతువాద సంఘ మహాసభలు ఈ నెల 19వ తేదీన చీరాలలో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు కరణం రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. చీరాలలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మీటింగ్ హాలులో మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, ట్రెజరర్ షేక్ బాబు, సహాయ కార్యదర్శి కిశోర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంఘ కార్యాలయంలో డీఆర్వో ఎస్.ఎస్.ఖాజావలి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకొన్నారు. సంఘం చేసే సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని, దానికి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి కె.లూర్దురెడ్డి, ట్రెజరర్ పి. నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. సుబ్బారావు, ఎం.ఎస్.నాగేంద్రం, కె.మురళి, సంయుక్త కార్యదర్శులు ఐ. సాయిబాబు, పెద మస్తాన్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు. డాక్టర్ రామలింగారెడ్డి కంటి హాస్పిటల్, కాస్వి డెంటల్ క్లినిక్ వైద్యులు పరీక్షలు చేసి సభ్యులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. సందేహాలను నివృత్తి చేశారు.



డీఆర్వో ఖాజావలికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

వేటపాలెం: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.నహిద గురువారం తెలిపారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. అండర్– 17 విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో కాటం రాజు, 200 మీటర్లలో కిశోర్, కబడ్డీలో కాటంరాజు, చెస్‌లో గోపీకృష్ణ, వాలీబాల్‌లో కిశోర్, 3 కి.మీ., 5 కి.మీ. పరుగు పందెంలో గహత్, శ్రీను ప్రతిభ చాటారన్నారు. అండర్ –14 విభాగంలో 200 మీటర్లు, 400 మీటర్లు, వాలీబాల్‌లో వినయ్‌కుమార్, 400 మీటర్లలో సతీష్‌కుమార్, చెస్‌లో దేవరాజు, ఖోఖోలో చందు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను పీఈటీ కె. మమత, ఉపాధ్యాయులు అభినందించారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

శునకాల దాడిలో 15 గొర్రెలు మృతి

బల్లికురవ: మండంలోని కొప్పరపాడులో కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. బుధవారం అర్ధరాత్రి గ్రామంలోని బీసీ కాలనీలోని షేక్ వలి గొర్రెల దొడ్డిలోకి ప్రవేశించిన శునకాలు వాటిపై దాడి చేసి చంపేశాయి. సుమారు వంద గొర్రెలను మేపుతూ వలి జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. కుక్కల దాడితో 15 చనిపోగా, గాయపడిన వాటిని స్థానిక పశు వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు. కుక్కకాటుకు గురవడంతో బతకడం కష్టమేనని వివరించారు. ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు గ్రామంలో కుక్కలకు అడ్డుకట్ట వేయాలన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బుర్రి ఆదినారాయణ, మూడావత్ దానానాయక్‌లు చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. కుక్కలు ఏడాదిగా పలువుర్ని కరిచాయని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. తాను రూ.2 లక్షల వరకు నష్టపోయానని వలి తెలిపారు.



చనిపోయిన గొర్రెలు

వ్యవసాయశాఖ కమిషనర్‌కు అభినందనలు

కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను గుంటూరు చుట్టుగుంటలోని కార్యాలయంలో ఏపీ ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి, అసోసియేషన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి.. ప్రస్తుత పరిస్థితుల్లో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎరువుల లభ్యత గురించి కమిషనర్‌కు వివరించారు. రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ జిలానీ సమూన్ తెలిపారు. డీలర్ల సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కె.విజయకుమార్, ఉపాధ్యక్షులు చక్కా రవికుమార్, భీమవరపు శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆర్.చలపతిరావు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



యువర్స్

● వికాసం



నిరుద్యోగిగా ఉన్నా సరే...

కొద్దిమందిలో ఉండే అపోహ...
'కష్టపడుతున్నప్పుడే ఒత్తిడికి గురవుతాం'
అసలు విషయం ఏమిటంటే, కష్టపడుతున్నప్పుడే కాదు పనిచేయకుండా, ఏమీ పట్టకుండా ఉన్నప్పుడు కూడా ఒత్తిడికి గురవుతాము. మనం ఏదైనా విషయానికి సంబంధించి తరచుగా ఒత్తిడికి గురవుతుంటే 'అదంతేలే' అని అనుకోవడానికి లేదు. 'ఎందుకు ఇలా జరుగుతుంది?' అని విశ్లేషించుకుంటే ఒక పరిష్కార మార్గం తప్పనిసరిగా కనిపిస్తుంది.

ఒత్తిడిగా అనిపించినప్పుడు ఎవరికైనా చిన్న ఫోన్ కాల్ చేయండి, లేదా ఇమెయిల్ పంపించండి. చిన్న పని అయినా సరే, అది మీ ఒత్తిడిని తగ్గించడంలో కీలకం అవుతుంది.

నిరుద్యోగిగా ఉన్నా సరే క్రమశిక్షణకు దూరం కాకూడదు. ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాలి. ఒకటి కాకుంటే మరొకటి ఇంటర్వ్యూలకు హాజరవుతూనే ఉండాలి.

– జెఫ్ బెజోస్, ఫౌండర్, అమెజాన్

● ఆర్ట్ అండ్ కల్చర్



బొమ్మల కళ

బొమ్మలు మాట్లాడవు. తమ గురించి మాట్లాడేలా చేస్తాయి. అలా మాట్లాడాలంటే ఆర్టిస్ట్‌లో అద్భుత సృజన ఉండాలి. అలాంటి ఒక ఆర్టిస్ట్ ఆమదాలవలసకు చెందిన ప్రియాంక. శుభకార్యాలకు తగ్గట్టు రకరకాల థీమ్స్‌తో బొమ్మల సిరీస్ రూపొందిస్తూ పాతకళకు కొత్త కళ తీసుకువస్తోంది ప్రియాంక...

'చిన్నప్పుడు ఆడుకున్న ఆటల్లో బొమ్మలే నా బతుకు బండిని నడిపిస్తాయని నేను అసలు ఊహించనే లేదు' అంటుంది ప్రియాంక. బొమ్మల ద్వారా నేటి తరానికి సంప్రదాయ విలువలను వివరించడంలో ఆనందం ఉందంటారు ఆమె. తన మనసులో మెదిలిన ఊహకు సృజనాత్మకంగా ప్రాణం పోస్తూ, బొమ్మలను థీమ్‌కు తగ్గట్టు రూపొందిస్తూ వినియోగదారుల మనసు గెలుచుకుంటుంది ప్రియాంక. ఆ బొమ్మలు సనాతన సంప్రదాయాలకు ప్రతీకలుగా కనిపిస్తాయి. కనుమరుగవుతున్న కళలు కళ్ల ముందు కనబడతాయి.

అనుబంధాల రైలుబండి

కాంక్రీట్ జంగిల్‌లో న్యూక్లియర్ ఫ్యామిలీల నడుమ దూరమవుతున్న అనుబంధాలు ప్రియాంక తయారుచేసే బొమ్మలతో గుర్తుకు వస్తాయి. ఆమదాలవలసకు చెందిన ఒక పెద్దాయన 60వ పుట్టిన రోజు వేడుకను భిన్నంగా చేయాలని కుటుంబ సభ్యులు ఆలోచించారు. ప్రియాంకకు విషయాన్ని వివరించారు. అరవై ఏళ్లలో జరిగిన ఘట్టాలను అద్భుతమైన రీతిలో బొమ్మల రూపంలో కళ్లకు కట్టేలా తీర్చిదిద్దింది ప్రియాంక. అన్నప్రాసన వేడుక నుంచి పదవీ విరమణ వేడుక వరకు... ఆ పెద్దాయన జీవితంలోని వివిధ దశలను చిన్న రైలు బండి మాదిరిగా బొమ్మల్లో తయారు చేసి శభాష్ అనిపించుకుంది.

తాళికట్టు శుభవేళ

పలాసకు చెందిన ఒక వ్యాపారి నూతన గృహ ప్రవేశ వేడుకను భిన్నంగా చేయాలనుకున్నాడు. కాన్సెప్ట్‌ను వివరించాడు. బిల్డింగ్ నమూనా నుంచి సత్యనారాయణ వ్రతం, గో మాత ప్రవేశంతో సహా అన్నింటిని చక్కని బొమ్మలతో కళ్లకు కట్టింది ప్రియాంక. శుభకార్యానికి వచ్చిన అతిథులంతా ఈ థీమ్‌ను చూసి భలే ముచ్చటపడ్డారు.

శ్రీకాకుళం నగరంలోని ఒక కార్పొరేట్ బ్యాంక్‌లో నవరాత్రి పూజలు నిర్వహించాలని బ్యాంక్ సిబ్బంది భావించారు. రెండు రోజులు కష్టపడి నవరాత్రి వేడుకల థీమ్‌ను తయారు చేసి బ్యాంక్‌ను లక్ష్మీనిలయంగా మార్చింది ప్రియాంక. వివాహ వేడుకకు ప్రారంభ ఘట్టమైన గోధుమరాయి కార్యక్రమం నుంచి తాళికట్టు శుభవేళ వరకు తయారు చేసిన వెడ్డింగ్ సెట్ ప్రియాంక స్పెషల్. ఆ సెట్ చూస్తే మన కళ్ల ముందే పెళ్లి జరిగినంత సంబరం మన సొంతం అవుతుంది.

– దువ్వూరి గోపాలరావు,
సాక్షి, శ్రీకాకుళం
ఫొటోలు:
జయశంకర్ కుప్పిలి

ఇదే నా ప్రపంచం

చిన్నప్పుడే కాదు పెద్దయ్యాక కూడా బొమ్మలను వదల్లేదు. అమ్మ సాయంతో వాటిని చక్కగా అలంకరించడం చిన్నప్పటి నుంచి నా అలవాటు. డిగ్రీ పూర్తయింది. ఉపాధి కోసం ఏదో ఒకటి చేయాలి అనుకున్నాను. బొమ్మలతోనే కొత్తగా ఏదైనా చేయాలనుకున్నాను. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నా ఆలోచనలను నాన్నతో పంచుకున్నాను. ఆయన ప్రోత్సహించారు. వర్క్‌షాపులో కొంత భాగం నన్ను వినియోగించుకోమన్నారు. ఆర్టిస్టిక్‌గా షోరూమ్‌ను సిద్ధం చేశారు. విభిన్న రకాల థీమ్‌లను సిద్ధం చేశాను. సోషల్ మీడియా వేదికగా నేను తయారుచేసిన బొమ్మలను, ఫొటోలను షేర్ చేయడం మొదలుపెట్టాను. ఆర్డర్లు పెరిగాయి. బొమ్మల ద్వారా సంప్రదాయాల్ని వివరిస్తున్నందుకు ఆనందంగా ఉంది.

- ప్రియాంక

● టెక్... టాక్



నానో బనానా... సెర్చ్ అండ్ లెన్స్

జీవం ఉట్టిపడే ఇమేజ్ జనరేషన్‌తో జెమిని 'నానో బనానా మోడల్' పాపులర్ అయింది. నానో బనానా ఏఐ మోడల్‌ను ప్రారంభించినప్పటి నుంచి 500 మిలియన్‌లకు పైగా ఇమేజ్‌లకు ఉపయోగించబడింది. తాజాగా... జెమిని యాప్స్ నుంచి సెర్చ్ అండ్ లెన్స్‌కు నానో బనానా మోడల్‌ను విస్తరించారు. ఇమేజ్‌లు జనరేట్ చేయడానికి, ఎడిట్ చేయడానికి నానో బనానాను ఏఐ మోడ్, గూగుల్ లెన్స్‌తో అనుసంధానించారు. దీనివల్ల యూజర్‌లు గూగుల్ ఎకోసిస్టమ్ దాటకుండానే అడ్వాన్స్‌డ్ ఏఐ ఇమేజ్ ఎడిటింగ్ అండ్ క్రియేషన్ టూల్స్‌తో యాక్సెస్ కావచ్చు. గూగుల్ సెర్చ్ ఏఐ మోడల్‌లో ప్రాంప్ట్ బాక్స్ దిగువన ఎడమవైపు కొత్త ప్లస్ ఐకాన్ కనిపిస్తుంది. ఈ ఐకాన్‌ను నొక్కితే కొత్త గ్యాలరీ, కెమెరా, క్రియేట్ ఇమేజ్‌లాంటి కొత్త క్రియేటివ్ ఆప్షన్స్ కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్‌లకు ఈ ఇంటిగ్రేషన్ అందుబాటులో ఉందా లేదా అనే విషయంలో స్పష్టత లేదు.

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11



డిస్‌ప్లే:	14.60 అంగుళాలు
రిఫ్రెష్ రేట్:	120 హెచ్‌జడ్
రిజల్యూషన్:	1848×2960 పిక్సెల్స్
మెమోరీ:	128జీబి 12జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా:	12 ఎంపీ
బ్యాటరీ:	11600 ఎంఏహెచ్

హెచ్ఎండీ టచ్ 4జీ



సైజ్: 3.2 అంగుళాలు
రిజల్యూషన్: 240×320 పిక్సెల్స్
బరువు: 100 గ్రా.
కలర్స్: డార్క్ బ్లూ, సియాన్
ఇంటర్నల్: 64 ఎంబీ
128 ఎంబీ ర్యామ్

వన్‌ప్లస్ పాడ్ లైట్



డిస్‌ప్లే: 11.00 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 5 ఎంపీ,
రిజల్యూషన్: 1920× 1200 పిక్సెల్స్
ర్యామ్: 6జీబి ఇంటర్నల్ స్టోరేజ్: 128జీబి
బ్యాటరీ: 9340 ఎంఏహెచ్ బరువు: 530 గ్రా.

● ఏఐ ఏరియా

మాయి-ఇమేజ్-1



ఈ సంవత్సరం ప్రారంభం నుంచి మైక్రోసాఫ్ట్ ఏఐ(మాయి) ఇన్-హౌజ్ జనరేటివ్ మోడల్స్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టింది. గత ఆగస్టులో స్పీచ్ జనరేషన్ మోడల్ మాయి-వాయిస్-1 లాంచ్ చేసింది.

తాజాగా తమ మొట్టమొదటి మాయి-ఇమేజ్-1ను ఆవిష్కరించింది.

ఇది 10 టెక్స్ట్-టు-ఇమేజ్ జాబితాలో చోటు సాధించడం విశేషం.

జనరల్ పర్పస్ ఏఐ మోడల్స్‌లా కాకుండా 'మాయి-ఇమేజ్-1'ను 'పర్పస్-బిల్ట్' మోడల్‌గా తీర్చిదిద్దారు. ప్రాక్టికల్, రియల్ వరల్డ్ క్రియేటివ్ టాస్క్‌లకు ఈ మోడల్ బాగా ఉపయోగపడుతుందని కంపెనీ తెలియజేసింది. ఈ మోడల్‌కు సంబంధించి సాంకేతిక విషయాలను వివరంగా వెల్లడించనప్పటికీ లైటింగ్, ప్రకృతి దృశ్యాలు, ఇతర సృజనాత్మక దృశ్యాలతో సహా ఫోటోరియలిస్టిక్ చిత్రాలను రూపొందించడంలో ఈ మోడల్ బలాన్ని కంపెనీ హైలైట్ చేసింది.

ఇతర మోడల్స్‌తో పోల్చితే 'మాయి-ఇమేజ్-1' చాలా త్వరగా రిజల్ట్‌ను చూపిస్తుందని, వేగం, నాణ్యత మధ్య బ్యాలెన్స్ చూపిస్తుందని తెలియజేసింది మైక్రోసాఫ్ట్.



విన్ బై ఏ నోస్

చాలా తక్కువ తేడాతో విజయం సాధించడానికి సంబంధించి వాడే మాట... విన్ బై ఏ నోస్
ఉదా: శ్రావణి వోన్ ది రేస్, బట్ షీ వోన్లీ వోన్ బై ఏ నోస్

వెల్ అప్ ఇన్ ఇయర్స్

'వయసు పైబడిన' 'పాత' అనేదానికి సంబంధించి వాడే మాట... వెల్ అప్ ఇన్ ఇయర్స్
ఉదా: జాన్స్ వెల్ అప్ ఇన్ ఇయర్స్ బట్ హెల్తీ

ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్

'కష్టాలు శాశ్వతం కాదు' అనే చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట... ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. **ఉదా:** బట్ ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. ఐయామ్ ష్యూర్ థింగ్స్ విల్ చేంజ్ సూన్

సాక్షి సినిమా

ముచ్చటగా మూడోసారి!


● నెల్సన్, రజనీకాంత్

హీరో రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్‌లది హిట్ కాంబినేషన్. వీరి కాంబోలో వచ్చిన తొలి చిత్రం 'జైలర్' 2023 ఆగస్టు 10న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరి కలయికలో 'జైలర్ 2' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'జైలర్' సూపర్ హిట్ కావడంతో 'జైలర్ 2' సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2026 జూన్‌లో 'జైలర్ 2' విడుదల కానుంది. ఇదిలా ఉంటే... రజనీకాంత్-నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్ ముచ్చటగా మూడోసారి రిపీట్ కానుందని కోలీవుడ్ టాక్. ఇప్పటికే 'జైలర్ 2' చిత్రీకరణ సుమారు 70 శాతం పూర్తయిందట. ఈ సినిమా తర్వాత మరోసారి రజనీకాంత్‌తో ఓ మూవీ కోసం నెల్సన్ దిలీప్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ స్టోరీ లైన్‌ని ఇటీవల రజనీకాంత్‌కి వినిపించగా ఆయన కూడా పచ్చజెండా ఊపారట. మరి... రజనీ-నెల్సన్ కాంబినేషన్‌లో మూడో చిత్రం ఉంటుందా? అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం

\- చిరంజీవి


● సుస్మిత, తిలక్ వర్మ, చిరంజీవి, అనిల్ రావిపూడి

ఇటీవల జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను హీరో చిరంజీవి సన్మానించారు. చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా, కేథరిన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సెట్స్‌కి ఇటీవల తిలక్ వర్మని ఆహ్వానించి, యూనిట్ సమక్షంలో సన్మానించారు చిరంజీవి. ''ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్- పాకిస్థాన్ తలపడ్డాయి. ఎంతో ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలక భాగస్వామి అయిన తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం. కృషి, క్రమశిక్షణ అన్నది కేవలం క్రీడల్లోనే కాకుండా జీవితంలోనూ విజయానికి మార్గదర్శకం'' అని చిరంజీవి చెప్పారు.

కాంబినేషన్ సెట్?


● విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ-డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే వార్తలు వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. తనకు 'టాక్సీవాలా' (2018) వంటి హిట్ మూవీ అందించిన దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌తో రెండో సినిమా చేస్తున్నారు విజయ్. మరోవైపు 'రాజావారు రాణిగారు' చిత్రదర్శకుడు రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేయనున్నారని టాక్. 'ఇష్క్, మనం, హలో, నానీస్ గ్యాంగ్‌లీడర్' వంటి పలు చిత్రాలను తెరకెక్కించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు విక్రమ్ కె. కుమార్. ఇక ఆ మధ్యలో నితిన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కిస్తారనే వార్తలు వచ్చినప్పటికీ ఎలాంటి ప్రకటన లేదు. అయితే తన తాజా చిత్రాన్ని విజయ్‌తో చేయనున్నారట విక్రమ్. ఇందుకోసం కథ సిద్ధం చేసే పనిలో ఉన్నారట. మరి... ఈ కాంబినేషన్ సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.


● విక్రమ్ కె. కుమార్

కచ్చితంగా నచ్చుతుంది డ్యూడ్

\- ప్రదీప్ రంగనాథన్


● రవిశంకర్, బుచ్చిబాబు, హను, సాయి, ప్రదీప్, మమిత, కీర్తీశ్వరన్, నవీన్

''తెలుగు ప్రేక్షకులు నా సినిమాలన్నింటినీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ కుటుంబంలో ఒకరిగా చూసినందుకు చాలా థ్యాంక్స్. నేను నటించిన 'లవ్ టుడే, డ్రాగన్' సినిమాలు మీకు నచ్చినట్లయితే.. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'డ్యూడ్' చిత్రం కూడా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. నాకు మంచి చాన్స్ ఇచ్చిన మైత్రి మూవీ మేకర్స్‌కి ధన్యవాదాలు'' అని ప్రదీప్ రంగనాథన్ చెప్పారు. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు హను రాఘవపూడి, బుచ్చిబాబు, సాయి రాజేశ్, రాహుల్ సాంకృత్యాన్, మహేశ్, శివ నిర్వాణ అతిథులుగా హాజరై, 'డ్యూడ్' ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కీర్తీశ్వరన్ మాట్లాడుతూ- ''నేను 'డ్యూడ్' స్క్రిప్ట్ రాసుకుని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. ఫైనల్‌గా మైత్రీ మూవీ మేకర్స్‌లో నా సినిమా ప్రయాణం ప్రారంభం అయింది. ఈ బ్యానర్‌లో పని చేస్తానని నా కలలో కూడా అనుకోలేదు'' అని చెప్పారు. ''అందమైన ప్రేమకథగా రూపొందిన ఈ చిత్రంలో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి'' అని రవిశంకర్ అన్నారు. ''ఈ సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుంది'' అని నవీన్ యెర్నేని పేర్కొన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ నికిత్ బొమ్మి, సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు మాట్లాడారు.

ఎల్లమ్మలో...


● దేవిశ్రీ ప్రసాద్

ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారని తెలిసింది. 'బలగం' ఫేమ్ దర్శకుడు వేణు యెల్దండి తర్వాతి చిత్రం 'ఎల్లమ్మ'. ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారు. విలేజ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హీరోగా నాని, నితిన్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన సంప్రదింపులు జరుగుతున్నాయని, ఈ చిత్రంలో నటించేందుకు దేవిశ్రీ కూడా ఆసక్తి చూపిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

పడి పడి నవ్వుకుంటారు

\- కిరణ్ అబ్బవరం


● జైన్స్ నాని, శివ, రాజేష్ దండ, యుక్తి తరేజా, కిరణ్ అబ్బవరం

''కె-ర్యాంప్' చిత్రం మేము అనుకున్నదానికంటే ఇంకా బాగా వచ్చింది. ఈ సినిమాని అనుకున్నప్పుడే దీపావళికి రిలీజ్ అని ఫిక్స్ అయ్యాం. థియేటర్స్‌లోకి వెళ్లేముందు ఇది పూర్తి వినోదాత్మక చిత్రం అని గుర్తుపెట్టుకోండి. కచ్చితంగా పడి పడి నవ్వుతారు. మీ టికెట్ డబ్బులు వృథా కావు.. ఇందుకు నాది గ్యారెంటీ'' అని కిరణ్ అబ్బవరం తెలిపారు. ఆయన హీరోగా, యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని రచన, దర్శకత్వంలో హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్‌పై రాజేష్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, చంద్రమోహన్ అతిథులుగా హాజరై, ''దీపావళి పండగ కళ 'కె-ర్యాంప్'లో కనిపిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది'' అని తెలిపారు. రాజేశ్ దండ మాట్లాడుతూ- ''మేము ఎంత ఏడ్చినా, తొడలు కొట్టినా, ఎన్ని చెప్పినా సినిమాలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ దీపావళికి రిలీజ్ అవుతున్న సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ కావాలి'' అని తెలిపారు. ''మా సినిమా అదిరిపోయింది. ఈ దీపావళికి పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు జైన్స్ నాని. ''తెలుగులో నేను చేసిన మూడో చిత్రమిది. 'కె-ర్యాంప్' చూశాక ప్రేక్షకులు నన్ను మరింతగా ఇష్టపడతారు'' అని యుక్తి తరేజా పేర్కొన్నారు.

ఓటీటీ
ఇది చూడొచ్చు

సమయం విలువ తెలిపే సినిమా

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ది డెస్పరేట్ అవర్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఓ ఆలోచన కథగా మారి సినిమాగా రావాలంటే ఎంతో మంది మార్బలం, వ్యయ ప్రయాసలు అవసరం. కానీ రచయితకు వచ్చిన ఆలోచనను దర్శకుడు నేర్పుగా తెరకెక్కిస్తేనే ప్రేక్షకులు ఆ సినిమాకి దగ్గరవుతారు. ఇప్పుడున్న ట్రెండ్‌కి అనుగుణంగా ఓ సినిమా తీయాలంటే కత్తి మీద సామే. ఎందుకంటే నేటి తరం ప్రేక్షకులు దర్శకుల ఆలోచనను అర్థక్షణంలోనే పట్టేస్తున్నారు. అందుకేనేమో ఇప్పటి దర్శకులు తమ సినిమాలలో వైవిధ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. అటువంటి వారిలో హాలీవుడ్ దర్శకులు కాస్త ముందుంటారనే చెప్పాలి. ఆ కోవకు చెందిన వాటిలో వచ్చినదే దర్శకుడు ఫిలిప్ నాయిస్ తీసిన 'ది డెస్పరేట్ అవర్' సినిమా. ఈ సినిమాని ఈయన 2021లోనే తీశారు. ఈ చిత్రం విడుదల తరువాత భారతదేశంలో చాలా సినిమాలు ఇదే పంథాలో వచ్చినా పెద్దగా గుర్తింపు రాలేదు. ఈ సినిమా నిజానికి ఓ బ్యూటిఫుల్ క్రాఫ్ట్ అని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా కొత్తగా సినిమా తీయాలనుకునే ఔత్సాహికులకు ఇదో చక్కటి పాఠం లాంటిది. ఇక థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడే ప్రేక్షకులకు ఇదో కన్నుల పండగలాంటిది. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి చూద్దాం. అమీకార్ తాను రోజూ వెళ్ళే జాగింగ్‌కి రెడీ అవుతుంది. ఇంతలో ఇంట్లో తన కొడుకు నోవా బెడ్ రూమ్‌లోనే బద్ధకంగా పడుకుండడం చూసి ఈ రోజు హెల్త్ బాగా లేకపోతే స్కూల్‌కి వెళ్ళవద్దు అని చెప్పి జాగింగ్‌కు బయలుదేరుతుంది. జాగింగ్‌లో అమీకార్ ఎప్పుడూ హెడ్ ఫోన్స్ పెట్టుకునే వెళుతుంది. కొంత సమయం జాగింగ్‌లో గడిచాక నోవా స్కూల్ నుండి ఓ ఫోన్ వస్తుంది. ఓ ఆగంతకుడు గన్‌తో స్కూల్‌లో చొరబడ్డాడని, పెద్ద ప్రమాదం జరగబోతోందని స్కూల్ ప్రిన్సిపల్ చెబుతుంది. ఇంతలో మరో ఫోన్ కాల్ ద్వారా తన కొడుకు నోవా స్కూల్‌కి వెళ్ళాడని, సరిగ్గా ఆ ఆగంతకుడి చేతికి చిక్కాడని తెలుస్తుంది. అమీకార్ ఆ సమయంలో స్కూల్‌కి చాలా దూరంలో జాగింగ్ చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక టాక్సీకి కబురు పెడుతుంది. టాక్సీ రావడానికి చాలా సమయం పడుతుండడంతో కంగారు పడుతుంది. ఇక అక్కడి నుండి అమీ తన దగ్గరున్న ఫోన్‌తో కొడుకును కాపాడుకుంటుందా? లేదా అన్నదే సినిమా. ఇక్కడ విషయం ఏమిటంటే తొంభై శాతం అమీ జాగింగ్‌లోనే సినిమా నడుస్తుంది. సినిమాలో ఇంకెవ్వరూ కనిపించరు. భారీ తారాగణంతో, బీభత్సమైన విజువల్స్‌తో గ్రాండియర్ ఫీస్ట్‌తో తీసిన సినిమాలు కనీసం కాసులు కూడా రాల్చలేని నేటి రోజుల్లో ఒక్కటంటే ఒకే పాత్రతో 84 నిమిషాల నిడివితో సినిమాని తీసిన ఈ దర్శకుడికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమాని మీరు కూడా చూసేయండి. మస్ట్ వాచ్ ఇట్.

– హరికృష్ణ ఇంటూరు